స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి




# జమీన్‌రైతు

సంపుటి : 78 సంచిక 41 12-10-2007 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-




### తన మంత్రుల తీరుతో ముఖ్యమంత్రి నిర్వేదం....

# ఒక్కరూ మాట్లాడరేమి?

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక్కసారిగా తీవ్రమైన నిర్వేదంలో పడిపోయారు. నిరాశతో క్రుంగిపోయి కనిపిస్తున్నారు. వేదాంతధోరణిలో పడ్డారు. తన మంత్రులు, తన వారను కున్న ఎమ్మెల్యేలు తనకు ఆపద వచ్చిన ప్పుడు పెదవి విప్పకపోవడం అందుకు కారణం.

తెలుగుదేశం అధినేత చంద్రబాబు జిల్లాల పర్యటనలో అణు బాంబు వంటి ఆరోపణ చేశాడు. ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గంటకు కోటి రూపాయల ప్రజాధనం కొల్లగొడుతున్నాడని; ఈ మూడేళ్లలో 29వేల కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించాడని ఆరోపించాడాయన. వైఎస్ మీద విమర్శలు చేయడం, ఆరోపణలు కురిపించడం చంద్రబాబుకు సర్వసాధారణం. అందులో కొత్తదనమేమీలేదు. కానీ గంటకు కోటి అనే నినాదమే కొంచెం ఇబ్బందికరమైనది. గతంలో నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటువంటి నినాదంతోనే ఎన్.టి.ఆర్‌ను జనం దృష్టిలో పలచన చేశాడు. ఎన్.టి.ఆర్ రోజుకు కోటి, కోడి లేకుంటే బ్రతకలేడని ఆయన ఇచ్చిన నినాదం జనం మనసులకు బాగా ఎక్కింది. అప్పటి వరకూ ఎన్.టి.ఆర్ అంటే దేవుడితో సమానం అనే భ్రమలో వుండిన ఓటర్లు ఆలోచనలో పడ్డారు. దాని ప్రభావం ఎన్నికలలో స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు చంద్రబాబు కూడా గంటకు కోటి అనే పల్లవి ఎత్తుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమే.

ఇంత పెద్ద ఆరోపణ ప్రచారంలోకి వస్తే, మూడు రోజులపాటు దానిపై ఒక్కరు కూడా స్పందించలేదు. చివరకు ముఖ్యమంత్రే స్వయంగా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి, వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఆరోపణ ఘాటుగా వుంది కాబట్టి, దానిపై ముఖ్యమంత్రి చేసే ఎదురు దాడి కూడా అంతే ఘాటుగా వుంటుందన్న భావనతో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు విలేకరులు పోర్లపడి వచ్చారు. సీనియర్లు, ఎడిషన్ ఇన్‌ఛార్జ్‌లు కూడా హాజరైనారు. గది క్రిక్కిరిసి పోయింది. కానీ విచిత్రంగా ముఖ్యమంత్రి మాత్రం చాలా పేలవంగా మాట్లాడారు. విచారణకు సిద్ధం అని ప్రకటించడం తప్ప ఆయన వివరణలో కారం మసాలాలు ఏమీ లేవు.

నిజానికి చంద్రబాబు మీద ఎదురుదాడి చేయడం చాలా సులభం. ఆయన ముఖ్యమంత్రిగా వున్న తొమ్మిదేళ్లలో చేసిన తప్పుడు పనులు చాలానే వున్నాయి. వ్యక్తిగతమైన ఆరోపణలకు చంద్రబాబు అతీతుడేమీ కాదు. చెప్పడానికి ఎంత సరుకైనా దొరుకుతుంది. కానీ ముఖ్యమంత్రి ఆ జోలికి వెళ్లలేదు. విచారణకు సిద్ధమేనా అని పెద్ద మనిషి వలె ప్రశ్నించి వదిలేశాడు.

ఆయనలోని ఈ నిర్లిప్తతకు కారణం - కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల వైఖరి. ప్రతిపక్ష నేత తనపై అంత తీవ్రమైన ఆరోపణ చేస్తే హైదరాబాదులోనే వున్న మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ మర్యాద కోసం కూడా ప్రతి విమర్శ చేయలేదన్న బాధపడుతున్నాడు ముఖ్యమంత్రి. మంత్రులకు చిన్న సమస్య

తొరవ 14వ పేజీలో

## ఎన్నికలదాకా కీలుబొమ్మతోనే పిసిసి

పిసిసి అధ్యక్షుడిగా కె.కేశవరావు స్థానంలో తాత్కాలిక అధ్యక్షుడినే కొనసాగించాలని ముఖ్యమంత్రి తలపోస్తున్నట్లు చెప్తున్నారు. కె.కె బలవంతపు రాజీనామా తర్వాత ఆపద్ధర్మంగా పశ్చిమ గోదావరి కాంగ్రెస్‌వాది జిఎస్‌రావును నియమించాడు దిగ్విజయ్‌సింగ్. పిసిసి ఉపాధ్యక్షులందరిలోకి ఆయన సీనియర్ కావడం అందుకు కారణమని చెప్తున్నారు. వారం పది రోజులలో కొత్త అధ్యక్షుడి నియామకం జరిగి పోతుంది కాబట్టి, ఎవరైతే ఏమి అనుకున్నారు అందరూ. కెకె కుర్చీ కోసం చాలా మంది పోటీ పడ్డారు. వి.హనుమంతరావు వంటి సీనియర్లు కూడా వురవురలాడారు. మల్లు రవిని పెట్టుకోవాలని ముఖ్యమంత్రి ముచ్చట పడ్డారు. ఈలోగా ఎఐసిసి మార్పులలో దిగ్విజయ్‌సింగ్ ఆంధ్రా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలి వెళ్లారు. నియామక ప్రక్రియ వాయిదా పడింది. దానితో ముఖ్యమంత్రి ఆలోచనలలో కూడా మార్పు వచ్చింది.

ఇప్పుడు పిసిసి అధ్యక్షుడయ్యేవాడు రేపటి ఎన్నికల వరకు కొనసాగుతాడు. రాజకీయంగా చురుకైన వాడు, తన మనిషైనా, పరాయి అయినా, ఆ సీట్లో వుంటే టిక్కెట్ల దగ్గర లేనిపోని చికాకులు తప్పవు. కేంద్ర ఎన్నికల సంఘంలో కూడా పిసిసి అధ్యక్షుడికి స్థానం వుంటుంది కాబట్టి, చికాకు పెట్టడం సులభం. ఆ తలనొప్పులు కొని తెచ్చుకోవడం కంటే తాను చెప్పినట్లు ఆడడం తప్ప, స్వంతంగా నోరు కూడా తెరిచి మాట్లాడలేని కీలుబొమ్మ వంటి జి.ఎస్ రావుతోనే ఈ రెండేళ్లు గడిపేస్తే ఎట్లా వుంటుందని తల పోస్తున్నాడు ముఖ్యమంత్రి. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మజ్జి తులసీదాస్‌ను పిసిసి అధ్యక్షుడిగా కొనసాగించగా లేనిది, తాను జి.ఎస్.రావుతో కాలం గడపడం తొప్పెట్లా అవుతుందన్నది వైఎస్ వాదన. ఢిల్లీలో కూడా ఆయన మాట నెగ్గితే, జి.ఎస్.రావు పంట పండినట్లే.

## టిఎస్ఆర్ మౌన వ్రతంలోని మర్మమేమిటి?



కేంద్రమంత్రి, నెల్లూరీయుడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఈమధ్య ఒక వారంరోజులపాటు మౌనవ్రతం పాటించారు. ఈ వారం రోజులు విశాఖపట్నం శివార్లలో, సింహాచలం దగ్గరున్న స్వామి స్వరూపానంద సరస్వతి ఆశ్రమంలో గడిపారాయన. పూజలు, వ్రతాలు, యజ్ఞాలు, యాగాలతో పొద్దుపుచ్చారు. ఎవరితోనూ మాట్లాడలేదు; ఏ రాజకీయ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. విశాఖవాసులు ఎవరైనా వెళ్లి పలకరించబోయినా, నిక్కచ్చిగా వెనక్కి తిప్పి పంపేశారు. ఆధ్యాత్మిక సంబంధిత అంశాలపైతప్ప మరి దేనిగురించీ మాట్లాడేది లేదని సైగలతో సూచించారు.

పూజలు, యాగాలు చేయడం సుబ్బరామిరెడ్డి గారికి కొత్తేమీకాదు. వేకువజామున గాయత్రి మంత్ర పఠనం, శివపూజతో ఆయన దినచర్య ప్రారంభమౌతుంది. సాధారణ సభలలో కూడా గుక్క తిప్పుకోకుండా శివస్తోత్రం చేస్తుంటారు. పూజారుల ప్రమేయం లేకుండా పుస్తకం చూడకుండా తనకు తానుగా రుద్రయాగం చేయగలరాయన. శివరాత్రి సమయంలో విశాఖ సముద్ర తీరంలో లక్ష శివలింగాలు పెట్టి అర్చించడం ఒక ఆనవాయితీ. ఆధ్యాత్మికత ఆయన జీవనశైలిలో ఒక భాగం. అయితే సూర్యుడు ఉదయించే లోపలే అవి పూర్తయిపోతూ వుంటాయి. అక్కడ నుంచి వ్యాపారం, వినోదం, రాజకీయం వగైరా వగైరాలు నడిచిపోతూ వుంటాయి. ఉదయం ఎంత నిశితంగా దేవుడిని కొలుస్తాడో, సాయంత్రం అంతే షోకిలాగా అందరినీ విలా

తొరవ 14వ పేజీలో





# డ్రై ఫ్లవర్స్‌తో ఇల్లు స్వర్గ సీమ!



సొంత ఇంటిని నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరు తలపోస్తారు. ఆ దిశగా తమ అభిరుచులు, అభిప్రా యాలకు అనుగుణంగా ఇంటిని అందంగా తీర్చిదిద్దుకొంటుంటారు. ఇంటి గుమ్మం దగ్గర్నుంచి సీలింగ్ వరకు ఎక్కడా రాజీపడకుండా ఇళ్లు అందంగా ఆకర్షణీయంగా వుండడంతోపాటు సౌకర్యవంతంగా వుండేలా కట్టించుకుంటున్నారు. సౌకర్యానికి కొంచెం స్టయిల్‌ను సమ్మిళితం చేసినట్లయితే ఆ గృహాలు స్వర్గసీమలే అవుతాయి. ఖరీదైన ఫర్నీచర్, ఫ్లోరింగ్, పెయింటింగ్స్‌కు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఇంటిని మరింత అందంగా అమర్చుకొనేందుకు అలంకరణ వస్తువులకూ అంతే ప్రాధాన్యత వుంటుంది. ముఖ్యంగా పింగాణితో చేసిన వస్తువులు, పూలకుండీలు, కళాత్మకంగా వుండే బొమ్మలు ఇలా రకరకాల అలంకరణ సామగ్రిని తమ ఇళ్లలో కొలువుండేలా చూసుకొంటుంటారు. ఇటువంటి అభిరుచి గల గృహ యజమానులకు, ముఖ్యంగా మహిళల మనసు దోచేలా వుంటున్నాయి డ్రై ఫ్లవర్స్, గ్రాస్, ఆకులు. మామూలుగా మనకు కనిపించే, మనం చూసే రకరకాల ఆకులను, మొక్కలను, పువ్వులను వాటి అసలు స్వరూపం చెక్కు చెదరకుండా వుండేలా జాగ్రత్తలు తీసుకొంటూ వాటిని మరింత ఆకర్షణీయంగా తయారు చేయడం ఈ డ్రై ఫ్లవర్స్ ప్రత్యేకత. పశ్చిమబెంగాల్, అస్సాం తదితర ప్రాంతా ల్లోని కళాకారులు రకరకాల పూలను, ఆకులను, గడ్డిని, చెట్ల నుంచి వేరు చేసి వాటి సహజత్వం చెడిపోకుండా, స్వరూపం మారకుండా వుండేలా చూడడంతోపాటు వాటికి రకరకాల రంగులను అద్ది కళాత్మకంగా, ఎంతో రమణీయంగా వుండేలా చేయడంలో ఆ కళాకారుల పనితనం, నైపుణ్యం ప్రస్ఫుటమౌతుంది. వీటి ధర ఒక్కొక్క ఫ్లవర్, ఆకులు ఐదు రూపాయల నుంచి ఇరవై రూపాయలకుపైగా ధరల్లో దొరుకుతున్నాయి. ఇంటిని అందాలను మరింతగా తీర్చిదిద్దుకోవాలనుకొనేవారు డ్రై ఫ్లవర్స్‌ను కొనుగోలు చేయవచ్చు.



# సరికొత్త డివిడి

ఎలక్ట్రానిక్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకొంటున్నాయి. వినియోగదారులను దృష్టిలో వుంచుకొని వివిధ కంపెనీలు కొత్త కొత్త మోడల్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. మొదట్లో రేడియోలు, టేప్‌రికార్డర్‌లు అటు తర్వాత టెలివిజన్‌లు ఎక్కువ కాలం రాజ్యమేలాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వచ్చిన మార్పుల ఫలితంగా బ్లాక్ అండ్ వైట్ టి.విల స్థానంలో కలర్ టివిలు, ప్లాస్మా టివిలు వచ్చాయి. అలాగే విసిఆర్, విసిపిలు వినియోగించి, క్యాసెట్ ద్వారా సినిమాలు వీక్షించే అవకాశం వుండేది. ఇప్పుడు విసిఆర్, విసిపిలకు కాలం చెల్లింది. అంతా సిడి, డివిడిల మయం కావడంతో సిడి ప్లేయర్‌లు, డివిడిలు, ఎంపీత్రి ప్లేయర్లు, హోమ్ థియేటర్లు కుప్పలు, తిప్పలుగా తయారవుతున్నాయి. పేరెన్నిక గన్న కంపెనీల నుంచి ఇంపోర్టెడ్ ప్లేయర్లు, చైనా సెట్‌లు మార్కెట్‌లో అందుబాటులో వున్నాయి. డివిడి లలో పేరొందిన వరల్డ్‌టెక్ కంపెనీ నూతనంగా డివెక్స్ పేరుతో డివిడి ప్లేయర్‌ను విడుదల చేసింది. ఈ కొత్త ప్లేయర్లు నెల్లూరు పొగతోటలోని ఎస్సార్ ఎలక్ట్రానిక్స్‌లో అందుబాటులో వున్నాయి. డివిడి సిస్టమ్‌తో పాటు దానికే టివిని కలిపి వుండడంతో ప్రత్యేకంగా టెలివిజన్‌ను కలిగి వుండాల్సిన అవసరం లేదు. డివెక్స్‌లోనే మోనిటర్, ప్లేయర్ వుంటాయి. అలాగే ఒకేసారి ఇరవై రెండు సినిమాలను ఈ సిస్టమ్‌లో పొందుపరుచుకొనే అవకాశం వుంది. వినియోగదారులు తమకు ఇష్టమైన సినిమాలను ఎంపిక చేసుకొని చూసుకొనే సదుపా యంతో వుంది. హోమ్ థియేటర్‌గా వినియోగించుకోవడంతో పాటు ప్రయాణ సమయాల్లోనూ దీనిని వాడుకోవచ్చు. వాహనాల్లో వెళ్లేటప్పుడు డివెక్స్‌ను చార్జి చేసుకొనే సదుపాయం వుంది. ఏడు గంటలకు పైగా బ్యాటరీ బ్యాక్ అప్ వుంటుంది. 16.9 ఎంఎం స్క్రీన్ కలిగిన ఈ డివెక్స్ సెట్‌తో పాటు ఇయర్ ఫోన్స్, రిమోట్ లభిస్తాయి. సులభంగా ఎక్కడికైనా వెంట తీసుకెళ్లగలిగేలా వున్నా డివెక్స్ సిస్టం కావాలనుకొనే వారు ఎస్సార్ ఎలక్ట్రానిక్స్ షాపును సందర్శించవచ్చు.



# హస్త కళల నిలయం లేపాక్షి ఎగ్జిబిషన్



రాష్ట్రవ్యాప్తంగా అందమైన బొమ్మలను తయారు చేసే కళాకారులు వున్నారు. కళాకారుల కళాత్మకతకు వారి ప్రతిభకు గీటురాళ్లుగా ఎన్నో రకాల వస్తువులను చెప్పుకోవచ్చు. అలాంటి హస్తకళాకారుల పనితనానికి, నైపుణ్యానికి వేదికయింది నెల్లూరు ఇందిరాభవన్. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ నేతృత్వంలో లేపాక్షి హస్తకళలు, చేనేతల ప్రదర్శన' ఇక్కడ ఏర్పాటయింది. ఈ నెల 16వరకు వుండే ఈ ప్రదర్శనలో ఎన్నో రకాల వస్తువులు, బొమ్మలు, వస్త్రాలు కొలువుదీరి వున్నాయి. ఎంతో రమణీయంగా వుండే కొండపల్లి బొమ్మలు, ఎంత సేపు చూసినా ఇంకా చూడాలనిపించేటట్లు వుండే ఏటికొప్పాక బొమ్మలు చూడముచ్చటగా వున్నాయి. లేస్‌తో చేసిన జంట్స్ టాప్స్, డ్రస్‌మెటీరియల్స్, బెడ్‌షీట్లు, ఎంతో అందంగా హస్తకళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా వున్నాయి. పోచంపల్లి చేనేతలు, టై అండ్ డై, గద్వాల్ డ్రస్ మెటీరియల్స్, జైపూర్ టాప్స్ యువతులను ఆకర్షిస్తున్నాయి. గద్వాల్ చీరలు రెండు వేల రూపాయల ధరల్లో లభ్యమవుతున్నాయి. జైపూర్ టాప్స్ ఎనభై రూపాయల నుంచి నూట ఇరవై రూపాయల ధరల్లో వున్నాయి. మిర్రర్ వర్క్ చేసిన బంజారా హ్యాండ్ బ్యాగ్స్, డ్రస్ మెటీరియల్స్, గాగ్రా డ్రస్సులు, కర్టెన్లు మరెన్నో కొలువుదీరి వున్నాయి. హర్యానా పానిపట్టు బెడ్‌షీట్లు, సోఫా కవర్లు, కలకత్తా, హైదరాబాద్ జూట్ బ్యాగ్స్ ఎంతో ఆకర్షణీయంగా, అందంగా ఇంటిలో అమర్చుకొనేందుకు వీలుగా వున్నాయి. రోజ్‌వుడ్‌తో చేసిన బొమ్మలు, షహరన్‌పూర్ వస్తువులు, బ్లాక్‌మెటల్, సిరామిక్



తొరవ 14వ పేజీలో

# చంద్రబాబు సభలకు అంత జనం రావడమేమిటి?

తెలుగుదేశం అధినేత చంద్ర బాబునాయుడు జరుపుతున్న జిల్లాల పర్యటనలకు జనం పోర్లబడి రావడం కాంగ్రెస్‌వాదులను కలవరపెడు తున్నది. ఆయన ఇటీవల అనంత పురం, వరంగల్ జిల్లాలకు వెళ్తే, వేల సంఖ్యలో గుమిగూడారు జనం. దారి పొడవునా జనమే. కొన్నిచోట్ల గంటా రెండు గంటలు ఎదురు చూడవలసి వచ్చినా ఓపికగా నిలబడ్డారు. ఈ పరిస్థితి చూసి తెలుగుదేశం నేతలే విస్మయపడుతున్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల పల్లెలలో కాంగ్రెస్ పట్ల సాను కూలత వెల్లి విరుస్తుందన్నది అందరూ అంగీకరించే నిజం. ఫించన్లు, ఇళ్లు, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు, ఇప్పుడు కొత్తగా కిలో రెండురూపాయల బియ్యం వంటి పథకాలు జనాన్ని సమ్మో హితులను చేస్తున్నాయి. నిజం చెప్పా లంటే గత ఎన్నికల కంటే కాంగ్రెస్ పరిస్థితి మెరుగైంది తప్ప, తరుగు లేదు.

మరొకప్రక్క తెలుగుదేశం పార్టీలో కానీ, వారి కార్యకర్తలలో కానీ, కాగడా పెట్టి వెతికినా ఉత్సాహం కనిపించడం లేదు. తమ పార్టీ , తమ నేత ప్రజలలో క్రెడిట్ రేటింగ్ పొందలేక పోతున్నారని దిగులు పడుతున్నారు వారు. ఈ



నేపథ్యంలో చంద్రబాబు సభలకు అం తగా జనం తరలి రావడంలోని అర్థం ఏమిటో పరిశీలకులకు బోధ పడడం లేదు. అది దేనికి సూచనో కూడా అర్థం కావడం లేదు. జనం ఆలోచన లలో, రాజకీయ అభిప్రాయాలలో ఏమైనా మార్పులు వస్తున్నాయా, వస్తే ఎందువల్ల, కాంగ్రెస్ చేయలేని పని తెలుగుదేశం ఏమి చేయగలదని జనం నమ్ముతున్నారు వంటి ప్రశ్నలు రాజ కీయ వాదులను వేధిస్తున్నాయి. నిజా నికి అనంతపురంలో తెలుగుదేశం పార్టీ అత్యంత బలహీన స్థితిలో వుంది. పరి టాల రవితోపాటు, పార్టీకోసం ప్రాణ మిచ్చే కార్యకర్తలు దాదాపు వందమం దిని హతం చేశారు ఈ మూడేళ్లలో. చాలా గ్రామాలలో, ఇంకా చెప్పాలంటే కొన్ని నియోజక వర్గాలలో తెలుగుదేశం జెండా చేతపట్టుకోవడానికి కూడా సాహసించలేని దుర్భర పరిస్థితులు వున్నాయి. పచ్చచొక్కా తొడిగితే ప్రాణం పోతుందేమోనన్న భయం ఆవహించి వుంది కార్యకర్తలలో. అందువల్ల మన సులో అభిప్రాయాలు మనసులోనే అణ గదొక్కుకొని, మౌనంగా వుండి పోతు న్నారు తెలుగుదేశం అభిమానులు. ఆ పరిస్థితులలో చంద్రబాబు పర్యటనకు ఉత్సాహంగా జన సమీకరణ చేసే అవ కాశం ఎంత మాత్రం లేదు. అయినా సరే ఆయన సభలు విజయవంతం అయ్యాయంటే కారణం ఏమిటని పరి శీలించవలసిన అవసరం వుంది కదా?



చందన, సిఎంఆర్ ఫెస్టివల్ పవర్‌సేల్ మొదటి వారం డ్రాలో విజేతకు బంగారు నెక్లెస్ అందజేస్తున్న కలెక్టర్ సతీమణి పద్మావతి. ప్రక్కన చందన బ్రదర్స్ అధినేత వాసు, రాజీయార్డ్స్ పెంచలయ్య

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

13వ వర్ధంతి
శ్రీ గిద్దలూరు వీరభద్రయ్య గారు
మీరు మమ్మల్ని వదలి ఇంతకాలమైనా
నిరంతరం మమ్మల్ని ధర్మపదాన నడిపిస్తూ
మీ ఆశయాల సాధన కొరకు నిరంతరం కృషి చేస్తున్న
మాకు అన్ని వేళలా మీ ఆశీస్సులు వుండాలని కోరుకుంటూ



శ్రీ గిద్దలూరు వీరభద్రయ్య గారు
జననం: 12.4.1921 మరణం:13.10.1994

కుమారుడు - కోడలు
గిద్దలూరు వెంకట సోమశేఖర్ - శార్వాణి
క్లర్క్ & క్యాషియర్
ఆంధ్రాప్రగతి గ్రామీణ బ్యాంక్, వాకాడు.
మనుమడు : గిద్దలూరు శివరాం
రిపోర్టర్ TV 9, హైదరాబాద్.

# పిచ్చేషాలేస్తే లేపేస్తా...!

ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకల నివారణలో విఫలమౌతున్న సీనియర్ అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన హెచ్చరిక ఇది. సాధారణంగా ఆయన అధికారిక సమీక్ష సమావేశాల పట్ల ఆసక్తి చూపరు. ఏదో మొక్కుబడిగా సమావే శాలకు పిలవడం, ముళ్లమీద కూర్చు న్నట్లు కొద్దిసేపు కాలం గడిపి, మీకు అంతా తెలుసుకదా, జాగ్రత్తగా చూసు కోండి అని చెప్పి వెళ్లి పోవడం ఆయ నకు అలవాటు. సమీక్ష సమావేశాలలో కానీ, అధికారికంగా నిర్వహించే సభ లలో కానీ ఆయన చూపులన్నీ గడి యారం మీదే ఉంటాయి. ప్రభుత్వం మీద కాని, ఎమ్మెల్యేలు, మంత్రుల మీద కానీ వచ్చే అవినీతి ఆరోపణలు, అక్ర మాల వార్తలకు పెద్దగా విలువ ఇవ్వ రాయన. మనవాళ్లే కదా అనే సాను భూతితో చూసీచూడనట్లు పోతుం టారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అక్రమాలు వెల్లువెత్తుతున్నాయని నివేది కలు వచ్చినప్పుడు కూడా అదే వుదా సీనత ప్రదర్శించారు" మొదట్లో. తన పార్టీ ఎమ్మెల్యేలు తప్పులు చేసి వుంటా రనే భావనతో వుండినారు. కానీ ఈ అక్రమాలలో ఎమ్మెల్యేల ప్రమేయం కంటే అధికారుల చేతివాటమే అధిక మని ఇప్పుడిప్పుడే అర్థమౌతున్నది. అవి నీతి ఆరోపణల మీద ప్రభుత్వం చర్య తీసుకోదన్న భావన ప్రచారం కావ డంతో క్రిందిస్థాయి అధికారులు అడ్డ దుడ్డంగా ప్రవర్తించడం అలవాటు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు చెప్పిన తప్పుడు పని ఒకటి చేసి, తమ చేతి వాటంతో పది తప్పులు చేయడం అల వాటై పోయింది. దీనితో మొత్తం పథ కమే గోల్మాల్ వ్యవహారంగా తయా రైంది. ఈ ప్రమాదాన్ని అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రెడ్డి సుబ్రమణ్యం వంటి సీనియర్ అధికారులతో సహా, ఇంది రమ్మ ఇళ్ల పథకంలో ప్రమేయం ఉన్న వారందరినీ పిలిపించి లోతుగా సమీక్ష జరిపారు. అందులో పథకం అమలుకు అవరోధంగా ఉన్నది క్రిందిస్థాయి ఉద్యో గులేనన్న విషయం స్పష్టంగా బయట పడింది. దానితో ముఖ్యమంత్రికి కోపం తన్నుక వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇళ్ల పథకాన్ని అధికారులు తేలికగా తీసుకో వడం, చేతివాటం ప్రదర్శించడం ఏమి టని మండిపడ్డారాయన. మీ పద్ధతి మార్చుకోకుంటే లేపేస్తా... అని గట్టిగా హెచ్చరిక చేశారు. ఆయన స్వరంలోని తీవ్రత ఆ సమావేశంలో ఉన్న అధికా రులకు చెమటలు పట్టించింది. లేపేస్తా అనే పదంలో ముఖ్యమంత్రి ఉద్దేశం బదిలీ చేస్తాననడం అయినప్పటికీ వైఎస్ నోట ఆ పదం వినగానే అందరూ ఉలిక్కి పడ్డారు.

మూడేళ్లపాటు అధికారులను ఇష్టారాజ్యంగా వదలి పెట్టకుంటే, ఇప్పుడు ఇంత కఠినంగా మాట్లాడవలసి వచ్చేదా అని ముఖ్యమంత్రిని అభిమా నించే అధికారులు బాధపడుతున్నారు. అధికారులను మెత్తగా, మర్యాదగా చూసుకొంటే బాగా పనిచేస్తారని భావిం చారాయన. తన ప్రభుత్వం అధికారు లను వేధించదని పదేపదే చెప్పేవారు. పునరంకిత సభలో కూడా ఆ మాట ఉల్లేఖించారు. కానీ మృదుత్వం అన్ని దగ్గరలా పని చేయదని ఇప్పుడు తెలు సుకున్నాడన్న మాట.

WANGS KITCHEN
Delightfully Chinese
మా రెండవ వార్షికోత్సవం శుభసందర్భముగా ఆదరిస్తున్న కస్టమర్ మిత్రులందరికి హృదయపూర్వక ధన్యవాదములు.
మీ అందరి ఆశీస్సులతో
సరికొత్త రుచులతో ఇండియన్ డిషస్ ప్రారంభం
INDEANA
Deliciously Indian
మీ ఆదరమే మా ఆనందం - మీ ఆనందమే మా ఆశయం
Aditi Crystal, Below ICICI Bank
Near Madras Bus stand, Nellore
Home Delivery
Ph: 2316622, 9963663388

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.